క్లుప్తంగా

సకాలంలో ఫీజు చెల్లించండి

అయిజ: జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలోని అధ్యయన కేంద్రంలో ఓపెన్ టెన్త్, ఇంటర్‌లో అడ్మిషన్ పొందేందుకుగానూ సకాలంలో ఫీజు చెల్లించాలని కేంద్రం కోఆర్డినేటర్ ఎంఆర్ఎస్‌పీ శర్మ సోమవారం ప్రకటనలో తెలిపారు. నిర్ణీత గడువు ఈనెల 10తో ముగిసిందని, అపరాధ రుసుముతో ఈనెల 31లోగా ఫీజు చెల్లించాలని సూచించారు. ఫీజు రశీదును అధ్యయన కేంద్రంలో అందజేయాలని కోరారు.

సెల్‌ఫోన్ అందజేత



గద్వాల క్రైం: పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను గంట వ్యవధిలో పోలీసులు గుర్తించి బాధితుడికి అందజేశారు. రూరల్ ఎస్ఐ ఆనంద్ వివరాల మేరకు.. చంద్రన్న అనే వ్యక్తి బైక్‌పై గద్వాల నుంచి ధరూర్ వైపు వెళ్తుండగా, సంగలపార్కు సమీపంలో సెల్‌ఫోన్ పడిపోయింది. ఫోన్ కోసం బాధితుడు వెతికినప్పటికీ ఫలితం లేకపోయింది. విషయాన్ని రూరల్ పోలీసుల దృష్టికి తీసుకురాగా, సాంకేతిక పరిజ్ఞానంతో సెల్‌ఫోన్‌ను గుర్తించి బాధితుడికి అందజేసినట్లు ఎస్ఐ తెలిపారు. సెల్‌ఫోన్ మిస్సయిన గంట వ్యవధిలోనే పోలీసులు గుర్తించి అందజేయడంపై బాధితుడు సంతోషం వ్యక్తం చేశారు.

ఆరోగ్యంపై జాగ్రత్తలు తప్పనిసరి

మల్దకల్: ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని మండల వైద్యాధికారి స్వరూపారాణి సూచించారు. సోమవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రిలో మెరుగైన వైద్యం అందుతోందని, గర్భిణులు ప్రతినెలా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీధర్, సత్యమ్మ పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



అయిజ: స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం మండల కేంద్రంతోపాటు పలు గ్రామాల్లో బీజేపీ నాయకులు జాతీయ జెండాలను పంపిణీ చేశారు. మొత్తం 400 మందికి జాతీయ జెండాలను అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో మునిస్వామి, సంజన్న, గజ్జలన్న, వీరేష్, శేఖర్ పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

రాజోళి: తెలంగాణ గ్రామపంచాయతీ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ మండల కమిటీని సోమవారం సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు వెంకటస్వామి ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల గౌరవాధ్యక్షుడిగా విజయ్‌కుమార్, అధ్యక్షుడిగా తిక్కన్న, ఉపాధ్యక్షుడిగా కృష్ణ, ప్రధాన కార్యదర్శిగా లక్ష్మన్న, సహాయ కార్యదర్శి మహేష్, కోశాధికారిగా సత్తార్‌ను ఎన్నుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు తిప్పన్న పాల్గొన్నారు.

కొనసాగిన సప్తాహ భజనలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో సప్తాహ భజనలు సోమవారం కొనసాగాయి. స్వయంభూ లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయంలో వివిధ గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు సంకీర్తనలు ఆలపించారు. వారంరోజులపాటు నిర్వహించే సప్తాహ భజన కార్యక్రమంలో పాల్గొనే భజనపరులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు అరవిందరావు, చంద్రశేఖర్‌రావు, అర్చకులు రమేషాచారి, మధుసూదనాచారి, రమేషాచారి తదితరులు పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

అయిజ: మండలంలోని తొత్తినోనిదొడ్డిలో సోమవారం వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ స్వరూపారాణి ఆధ్వర్యంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేశారు. మొత్తం 282 పశువులకు వ్యాధి నిరోధక టీకాలు వేసినట్లు సిబ్బంది తెలిపారు. గాలికుంటు వ్యాధితో పశువులు చనిపోయే ప్రమాదం ఉందని, తప్పనిసరిగా టీకాలు వేయించాలని కోరారు.

భగవద్గీతపై ప్రచారం

మానవపాడు: మండలంలోని కలుకుంట్లలో సోమవారం త్రైత సిద్ధాంత భగవద్గీతపై హిందూ ధర్మ ప్రచార సేవాసమితి సభ్యులు ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సేవాసమితి సభ్యుడు లక్ష్మణ్ మాట్లాడుతూ మానవుడు కర్మ ప్రతిఫలాన్ని తప్పక అనుభవిస్తాడని, కర్మయోగం విశిష్టత గురించి తెలియజేసేది త్రైత సిద్ధాంత భగవద్గీత మాత్రమేనని తెలిపారు. అనంతరం భగవద్గీత గ్రంథాలను పంపిణీ చేశారు.

ముచ్చటగా ముగ్గురు తహసీల్దార్లు

- పదిరోజుల వ్యవధిలోనే మార్పు
- విస్మయం వ్యక్తం చేస్తున్న ప్రజలు



గట్టు తహసీల్దార్ కార్యాలయం

గట్టు: మండలంలో తహసీల్దార్ల మార్పు చర్చనీయాంశంగా మారింది. పదిరోజుల వ్యవధిలోనే ముగ్గురు తహసీల్దార్లు మారడం విస్మయానికి గురిచేస్తోంది. ఒకరు గట్టుకు రాకుండానే బదిలీపై వేరే మండలానికి వెళ్లిపోగా, మరో తహసీల్దార్ వారం రోజుల కిందట వచ్చినా చార్జ్ తీసుకోకుండానే శిక్షణకు వెళ్లారు. శిక్షణ పూర్తి చేసుకుని సోమవారం విధుల్లో చేరగా, గంటసేపు కూడా కుర్చీలో కూర్చోకుండానే ఇక్కడి నుంచి బదిలీపై మరో చోటకు వెళ్లిపోయారు. మరో తహసీల్దార్‌ను గట్టుకు కేటాయించారు. వివరాల్లోకి వెళ్తే.. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఇటీవల తహసీల్దార్ల బదిలీలు చేపట్టిన విషయం తెలిసిందే. గట్టు తహసీల్దార్‌గా పనిచేస్తున్న మహ్మద్ జుబేర్ మొహినుద్దీన్ ఈనెల 4న బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వెంకటేశ్వర్లును జిల్లా అధికారులు నియమించగా, ఆయన కనీసం గట్టు ముఖం కూడా చూడకుండానే మరో మండలానికి బదిలీ అయ్యారు. ఆ తర్వాత ఈనెల 7న వికారాబాద్ జిల్లా నుంచి వహిదాఖాతూంను గట్టు తహసీల్దార్‌గా నియమించారు. వహిదాఖాతూం చార్జ్ తీసుకోకుండానే శిక్షణ నిమిత్తం వెళ్లిపోయారు. 14న గట్టు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని కుర్చీలో కూర్చునే లోపే ఆమె బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. ప్రస్తుతం మరో తహసీల్దార్ శ్రీనివాసరావును గట్టుకు బదిలీ చేశారు. ఈ సారు ఇక్కడ ఎన్ని రోజులు ఉంటారో వేచి చూడాలి.

దేశ ఔన్నత్యానికి పాటుపడాలి



మానవపాడులో 75 ఆకారంలో మొక్కలు నాటిన అధికారులు



ఉండవెల్లిలో..

ఉండవెల్లి: దేశ ఔన్నత్యానికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని అడిషనల్ డీఆర్డీఓ నాగేంద్రం అన్నారు. ఆజాదీకా అమృత్ మహోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 75 ఆకారంలో 75 మొక్కలను నాటించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ పద్మావతి, పంచాయతీ కార్యదర్శి అశోక్ పాల్గొన్నారు.

ధరూరు: పంద్రాగస్టు వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేసింది. ప్రభుత్వ కార్యాలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. గ్రామాల్లో ఇంటింటికీ జాతీయ జెండాలను పంపిణీ చేశారు.

మానవపాడు: ఆజాదీకా అమృత్ మహోత్సవాల ముగింపు సందర్భంగా మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో 75 ఆకారంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి నాగేంద్రం, ఎంపీడీఓ రమణారావు పాల్గొన్నారు.

17న మండల సర్వసభ్య సమావేశం

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 17న మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ రాఘవ సోమవారం ప్రకటనలో తెలిపారు. ఉదయం 11గంటలకు ప్రారంభం కానున్న సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని కోరారు.

గాంధీ సినిమా ప్రదర్శన



గద్వాల/అయిజ: స్వాతంత్య్ర వజ్రోత్సవాలను పురస్కరించుకొని జిల్లా కేంద్రంతోపాటు అయిజ పట్టణంలో గాంధీ చిత్రాన్ని ఉచితంగా ప్రదర్శించారు. గద్వాలలో 550మంది, అయిజ భువనేశ్వరి థియేటర్‌లో 349మంది, శివసాయి థియేటర్‌లో 331మంది విద్యార్థులు సినిమాను తిలకించారు. విద్యార్థుల్లో దేశభక్తి పెంపు, మహనీయుల జీవిత చరిత్రను తెలుసుకునేందుకుగానూ గాంధీ సినిమాను ఉచితంగా ప్రదర్శించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేశారు. ఆయా థియేటర్ల వద్ద ప్రత్యేకాధికారులను నియమించారు. అడిషనల్ కలెక్టర్ చీర్ల శ్రీనివాస్, డీఈఓ సిరాజుద్దీన్, డీపీఆర్ఓ చెన్నమ్మ, ఎంఈఓ సురేష్ తదితరులు విద్యార్థులతో కలిసి సినిమాను తిలకించారు.

కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి భూమిపూజ

ధరూరు: మండలంలోని కోతులగిద్దలో ఎస్సీ, బీసీ కమ్యూనిటీహాళ్ల నిర్మాణానికి సోమవారం సర్పంచ్ రమేష్ భూమిపూజ చేశారు. ఒక్కో కమ్యూనిటీహాల్‌కు రూ.20లక్షల చొప్పున రూ.40లక్షలు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బోయ రంగస్వామి, ఈడిగి రంగస్వామి, తెలుగు ఆంజనేయులు, దుబ్బన్న, మాల నర్సింహులు, చిరు పాల్గొన్నారు.



కమ్యూనిటీహాల్ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న నాయకులు

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి



డి.బూడిదపాడులో పంటలను పరిశీలిస్తున్న ఏడీఏ

ఉండవెల్లి: పంటల సాగులో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. మండల కేంద్రంతోపాటు డి.బూడిదపాడు శివారుల్లో సోమవారం పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ పంటల సాగులో వ్యవసాయాధికారుల సలహాలు, సూచనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. అనంతరం మండల కేంద్రంలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేష్ పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మల్దకల్ : సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రతి ఒక్కరూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ యాకోబు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని పలు కాలనీల్లో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం లోపించకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. దుకాణదారులు చెత్తను రోడ్లపై వేయొద్దని సూచించారు. ఆయన వెంట వార్డుసభ్యులు ఉన్నారు.

నిధుల ఖర్చు వివరాలు ఇవ్వండి

ధరూరు: మండల కేంద్రంలో 2014 నుంచి 2023 వరకు అభివృద్ధి పనులకు వెచ్చించిన నిధుల వివరాలు ఇవ్వాలని సోమవారం నడిగడ్డ హక్కుల పోరాట సమితి మండల నాయకులు పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఇప్పటి వరకు చేపట్టిన సీసీరోడ్ల నిర్మాణం, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతలు, గ్రామ అభివృద్ధి నిధుల వివరాలు తెలియజేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో అడవిల ఆంజనేయులు, జగదీష్, మల్దకల్, బరాస ఆంజనేయులు, దరెప్ప పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

టిప్పర్ల అడ్డగింత



గట్టు: మండల కేంద్రం మీదుగా కంకరను తరలిస్తున్న టిప్పర్లను సోమవారం రైతులు అడ్డుకున్నారు. జోకన్‌గట్టు క్వారీ నుంచి నిత్యం కంకర లోడుతో టిప్పర్ల రాకపోకలతో రోడ్డు పక్కన సాగు చేసిన పత్తి పంటతోపాటు ఇతర పంటలు దుమ్మూధూళితో దెబ్బతింటున్నాయని, మట్టిరోడ్డు పాడైపోతున్నట్లు రైతులు వాపోయారు. తార్‌రోడ్డు వేసుకుని టిప్పర్లను తిప్పాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించి రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని కోరారు.

'గృహలక్ష్మి'కి 66 దరఖాస్తులు

అలంపూర్ రూరల్: మండలంలో గృహలక్ష్మి పథకానికి సోమవారం 66 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ గోవిందరావు తెలిపారు. ఇల్లు లేని పేదలు గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోవాలని, అర్హులైన వారికి పథకం వర్తించేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



రాజోళి: మండల కేంద్రంలోని రాంపాటి శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాస శివరాత్రి సందర్భంగా తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామివారిని దర్శించుకొని నది నీటితో అభిషేకాలు, అర్చనలు చేశారు.

పైప్‌లైన్ ధ్వంసం



శాంతినగర్: వడ్డేపల్లి మున్సిపాలిటీలోని శాంతినగర్‌లో మిషన్ భగీరథ పైప్‌లైన్ ధ్వంసమైంది. సోమవారం రాయచూర్ ప్రధాన రహదారి విస్తరణ పనులు చేపడుతుండగా, పైప్‌లైన్ పగిలిపోయింది. దీంతో నీరంతా వృథాగా పారింది. విషయం తెలుసుకున్న అధికారులు నీటి సరఫరాను నిలిపివేశారు. సంబంధిత అధికారులు స్పందించి పైప్‌లైన్‌కు త్వరగా మరమ్మతు చేయించి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ప్రజలు కోరారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఎర్రవల్లిచౌరస్తా: ఇటిక్యాల మండలం కొండేరుకు చెందిన సత్యన్నగౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ నియోజకవర్గ మాజీ ఇన్‌చార్జ్ మందా శ్రీనాథ్, పోతురాజు శంకరమ్మ సేవాదళం అధ్యక్షుడు సోమనాద్రి సోమవారం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. వారి వెంట రాంరెడ్డి, దానం, యోహన్, బీచుపల్లి, వెంకటస్వామిగౌడ్, సిరాజ్, పవర్‌రాజ్, దేవన్న, రామకృష్ణ ఉన్నారు.

సన్నాహక సభను విజయవంతం చేయాలి

ఎర్రవల్లిచౌరస్తా: ఈనెల 16న జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న మాదిగల సన్నాహక సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి విజయ్ అన్నారు. ఎర్రవల్లి చౌరస్తాలో సోమవారం జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ ఆధ్వర్యంలో ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నూతన కమిటీలను ఏర్పాటు చేసేందుకు అందరూ సహకరించాలని కోరారు. 16న జిల్లా కేంద్రంలో జరిగే మాదిగల సన్నాహక సభకు ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. విజయ్, బీసన్న, రవి, వీరన్న, రాములు ఉన్నారు.

ముగ్గురిపై కేసు నమోదు

ఎర్రవల్లిచౌరస్తా: ఆర్టీసీ బస్సుపై దాడి చేసిన ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణదేవా తెలిపారు. ఎస్ఐ కథనం మేరకు కొదండాపురం గ్రామానికి చెందిన మణివర్ధన్, మహిందర్ మద్యం మత్తులో ఈనెల 12న గ్రామ స్టేజీ సమీపంలోని దాబా వద్ద ఆర్టీసీ బస్సుపై రాళ్లతో దాడి చేసినట్లు తెలిపారు. బస్సు డ్రైవర్ శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు వారిద్దరిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అదేవిధంగా ధర్మవరంలో మనఊరు–మనబడి పనులకు ఆటంకం కలిగించి.. సామగ్రిని ధ్వంసం చేసిన పుల్లన్నపై కాంట్రాక్టర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి

ఎర్రవల్లిచౌరస్తా: ప్రతి విద్యార్థి తప్పనిసరిగా వ్యక్తిగత శుభ్రత పాటించాలని మండల వైద్యాధికారి రమేష్ సూచించారు. సోమవారం ఇటిక్యాల, వల్లూరు, ధర్మవరం పాఠశాలలు, హాస్టల్‌లో విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వల్లూరులో నలుగురు, ధర్మవరంలో ఆరుగురు, ఇటిక్యాల గురుకుల కళాశాలలో ఐదుగురు విద్యార్థులకు కండ్లకలక వచ్చినట్లు గుర్తించారు. కండ్లకలక వచ్చిన విద్యార్థులకు చికిత్స అందించి.. అవసరమైన మందులను పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది శేఖర్, వెంకటేశ్వర్లు, భారతి తదితరులు పాల్గొన్నారు.

వడ్డేపల్లి తహసీల్దార్‌గా జ్యోతి

శాంతినగర్: వడ్డేపల్లి మండల తహసీల్దార్‌గా ఎస్.జ్యోతి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తహసీల్దార్ జయరాములు ఇటీవల బదిలీ అయ్యారు. దేవరకద్ర తహసీల్దార్ ఎస్.జ్యోతి బదిలీపై ఇక్కడికి వచ్చి.. ఇన్‌చార్జ్ తహసీల్దార్ వేణుగోపాల్‌రెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఆంజనేయులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

కేటీదొడ్డి: మండల తహసీల్దార్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన సరితారాణిని సోమవారం మీసేవ ఆపరేటర్ల సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మీసేవ కేంద్రాల్లో ప్రజల నుంచి నిర్ణీత రుసుము వసూలు చేయాలని, ఎవరైనా అధిక వసూళ్లకు పాల్పడితే చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శివశంకర్, మీసేవ కేంద్రాల నిర్వాహకులు వెంకటేష్‌నాయుడు, మౌలాలి, వెంకటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల డాక్యుమెంట్లు ఇవ్వాలని వినతి

ఉండవెల్లి: మండలంలోని పుల్లూరులో ఇంటి స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు ఇవ్వాలని కోరుతూ సోమవారం డిప్యూటీ తహసీల్దార్ జయంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2009లో వచ్చిన వరదల్లో ఇళ్ల స్థలాలకు సంబంధించిన డాక్యుమెంట్లు కొట్టుకుపోయాయని, డాక్యుమెంట్ల నకల్స్ ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నర్సింహులు, జయరాముడు, బుడ్డమ్మ, మద్దిలేటి, చిన్నప్ప, మద్దిలేటి పాల్గొన్నారు.

ఘనంగా చేనేత దినోత్సవం



కార్మికులకు ప్రశంసాపత్రాలను అందజేస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

రాజోళి: మండల కేంద్రంలో చేనేత దినోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా చేనేత, జౌళీశాఖ అధికారులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కార్మికులు ర్యాలీ నిర్వహించి చేనేత దినోత్సవ ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో పలువురు మాట్లాడుతూ.. చేనేత కార్మికులు మరింత నైపుణ్యం పెంపొందించుకొని కళాత్మకమైన చీరలను తయారు చేయాలని సూచించారు. కార్మికుల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం చేనేత కార్మికులకు ప్రశంసాపత్రాలను అందజేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏడీ గోవిందయ్య, ఉపసర్పంచ్ గోపాల్, మాజీ సర్పంచ్ శ్రీరాంరెడ్డి, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు నిషాక్, మూగెన్న పాల్గొన్నారు.

కుష్టుపై అవగాహన కల్పించాలి



రాజోళిలో మాట్లాడుతున్న డాక్టర్ మధుబాబు



మానవపాడులో..

రాజోళి: కుష్టుపై అందరికీ అవగాహన కల్పించాలని మెడికల్ ఆఫీసర్ మధుబాబు వైద్యసిబ్బందికి సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 16 నుండి 31వ తేదీ వరకు లెప్రసీపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. వైద్యసిబ్బంది గ్రామాల్లో పర్యటించి వ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం అందించే సహాయం గురించి తెలియజేయాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఈఓ రామకృష్ణ, రంజిత్‌కుమార్, జయప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

అలంపూర్ రూరల్: మండలంలోని క్యాతూర్ పీహెచ్‌సీలో ఎల్‌సీడీసీ పోస్టర్ మండల వైద్యాధికారిణి ప్రసూనరాణి, డీపీఎంఓ మల్లికార్జున్, నోడల్‌పర్సన్ బాలీశ్వరయ్యశెట్టి విడుదల చేశారు. ఈ సందర్భంగా కుష్టు నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆశ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. ఇంటింటి సర్వే నిర్వహించి కుష్టు వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రామస్వామి, ప్రతిభ స్ఫూర్తి, శివకుమార్, లీలమ్మ, అక్కమ్మ, మల్లమ్మ పాల్గొన్నారు.

మానవపాడు: జాతీయ కుష్ఠువ్యాధి నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం వైద్యసిబ్బంది ఇంటింటి సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రిజ్వానా తన్వీర్, ఏపీఎంఓ మధుమోహన్ మాట్లాడుతూ కుష్ఠువ్యాధి నిర్మూలనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అందరికీ అవగాహన ఉండాలని తెలిపారు. చంద్రన్న, సంధ్యారాణి, సోని, శారద, ప్రసన్న, షాజహాన్, జయమ్మ పాల్గొన్నారు.

స్క్రీనింగ్ కమిటీ చైర్మన్‌ను కలిసిన టీపీసీసీ కార్యదర్శి



మురళీధరణ్‌తో విజయ్‌కుమార్

గద్వాల అర్బన్: కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ చైర్మన్, ఎంపీ మురళీధరణ్‌ను సోమవారం హైదరాబాద్‌లో టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి కురువ విజయ్‌కుమార్ మర్యాద పూర్వకంగా కలిశారు. కాంగ్రెస్‌లో 15ఏళ్లుగా వివిధ హోదాల్లో పనిచేస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. గద్వాల నియోజకవర్గంలో తన అభ్యర్థిత్వాన్ని పరిశీలించాలని విన్నవించినట్లు విజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ విషయంపై ఇప్పటికే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఎన్నికల స్క్రీనింగ్ కమిటీ సభ్యులు భట్టి విక్రమార్క, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్‌కు విన్నవించినట్లు తెలిపారు.

ప్రమాదకర ప్రాంతాల్లో హెచ్చరిక బోర్డుల ఏర్పాటు

ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు ప్రధాన కుడి కాల్వ వెంట ప్రమాదకర ప్రాంతాల్లో పోలీసులు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేశారు. ఆదివారం జూరాల కుడి కాల్వలో నాగర్‌కర్నూల్ జిల్లా నాగనూలు గ్రామానికి చెందిన మధు గల్లంతయిన విషయం తెలిసిందే. దీంతో ఎస్పీ సృజన ఆదేశాల మేరకు ఎస్ఐ శివానందంగౌడ్ నేతృత్వంలో పోలీసులు రేవులపల్లి గ్రామశివారు ప్రాంతం వరకు ఉన్న కుడి కాల్వ వెంట ప్రత్యేకంగా బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే నెట్టెంపాడు ఎత్తిపోతల పథకంలో భాగంగా జూరాల బ్యాక్ వాటర్ ద్వారా ఫ్రీ ఫ్లోగా వెళ్లే కాల్వపై ఉన్న రోడ్ కం బ్రిడ్జి వద్ద సూచిక బోర్డును ఏర్పాటు చేశారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్నందున నదిలోకి, కాల్వలోకి ఎవరూ దిగవద్దని హెచ్చరిక బోర్డులో సూచించారు.



కుడికాల్వ హెడ్ రెగ్యులేటరీ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ఐఐటీ జేఈఈలో ధరూరు విద్యార్థి ప్రతిభ



విద్యార్థి గోవిందును అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ధరూరు: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థి గోవిందు ఐఐటీ జేఈఈలో ప్రతిభ చాటాడు. మండలంలోని ఓబులోనిపల్లికి చెందిన కే భీమన్న కుమారుడు గోవిందు ఐఐటీ జేఈఈ అడ్వాన్స్‌లో 65వేల ర్యాంకు సాధించి జమ్మూకాశ్మీర్ ఐఐటీ సెంట్రల్ యూనివర్సిటీ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో సీటు పొందాడు. ఈ సందర్భంగా కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణ, అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు. నిరుపేద రైతు కుటుంబానికి చెందిన విద్యార్థి గోవిందు ఉన్నత విద్య నిమిత్తం కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకుడు ఎం సత్యనారాయణ రూ.50వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం ప్రిన్సిపాల్ మాట్లాడుతూ చదువుతోనే బంగారు భవిష్యత్తు ఉంటుందని, క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూచించారు.